# "హరిజనులే కని హరిదగ్గెరికి పోవద్దాల్లు"

నేనేలెడంతున్నప్పటికెల్లి సూత్తన్న. మాదిగ మన్నెపోల్లను దేవునిగుల్లెకు రానియ్యకపోదురు. ఆల్లుగూడ గుల్లెకు పోతననక పోదురు. నేను బడికి పోతున్నప్పటికెల్లి వాళ్ళను హరిజనులని పిలుసుడింటున్న. హరంటె విష్ణుమూర్తని అందరికంటె పెద్దదేవుడని మా తెలుగుసారు చెప్పంగిన్న. అంటె హరిజనులంటె దేవుని మనుషులని సముజ్జేసుకున్న. మరి దేవుని మనుషులనే దేవునిగుళ్ళెకెందుకు పోనియ్యకపోదురో నాకరుతం గాపోవు. నాతోని సదువుకునే హరిజనుల పిల్లగండ్లు గాని, పెద్దోల్లు గాని దేవున్ని దూరంకెల్లి సూసి మొక్కెటోల్లు. గిది నాకు సానబాదనిపిచ్చేది. గా దేవుడు సాన మహిమలు గల్లోడేనాయె తన మనుషులనెందుకు తనదగ్గెరికి తీసుకోడో నాకు సముజే గాకపొయ్యేది. దొంతసాంబయని ఓ మాలాయినె మస్తు కీర్తనలు పాడెటోడు.

శివరాత్రినాడు మా ఊళ్ళె తెల్లంవాక భజనలు సేసెటప్పుడు సాంబయ్య కీర్తనలు సదివేటోడు. అందరేమో హనుమాండ్ల దేవునిచుట్టు సాపలల్ల కూసుండి భజనలు సేత్తంటె సాంబయ్య దూరంగ కింద కూసుండి సదివెటోడు. దేవుని కీర్తనలు పాడెటప్పుడు గూడ గీ పలపచ్చమెందుకో[61] నాకు తెలువకపోవు.

మా అవ్వ నన్ను మాదిగోల్లవాడకు తాల్లు తెమ్మని సెప్పుటానికి తోలేది. 'ఎవ్వలను ముట్టుకోవద్దు బిడ్డా' అని సెప్పి పంపేటిది. మా తాతయితె హరిజనవాడకు పోతె బజార్లున్న బట్టపేగును కూడ తొక్కకపోవునట. తప్పిపోయి బట్టపేగు తొక్కుతె పెయ్యికడుక్కున్నంకనే లోపలికి పోవునట. ఎలుమదొరల సోంటోల్లు ఉన్నోల్లల్లనయితె హరిజనులు ఆల్లకెదురుంగ కనవడితె సెప్పులిడిసి, రుమాల్దీసి సేతుల్ల వట్టుకోని నడువాలె. వంగివంగి దండాలు పెట్టాలె. వేరే ఊల్లల్ల గిట్లుంది ఇంక మనూరే నయ్యమని మా నాయిన్న నాతోన్జెప్పెటోడు.

ఊరోల్లంత సంబురంగ బతుకమ్మాడుకుంటుంటె మాదిగోల్లు గది గూడ ఆడకపోదురు. ఆల్లు పువ్వులు తెంపుకచ్చి మందికిచ్చెటోల్లు. బతుకమ్మ పండుగనాడు సత్తుముద్దలు గిట్ల అడుక్కోని తినెటోల్లు. మాలోల్లు అందరిలెక్క ఎన్మిదినాలు బతుకమ్మాడకుండ ఒక దసురనాడే ఆడెటోల్లు. బతుకమ్మ పండుగంటె అందరు సంబురంగాడుకునేటిదేనాయె. మరి గీ మాదిగోల్లెందుకు కస్సలే ఆడుకోవద్దో మన్నెపోల్లు ఒక్కనాడే ఎందుకాడుకోవాన్నో అని నా అండ్ల నేనే మనాది పడెటోన్ని.

గిట్లెందుకుండాలెనని సోపతికాల్లనడిగితె ఏం జెప్పలే. మా నాయిన్ననోపారడిగితె 'గిదెనుకట్నుంచత్తున్న ఇలవర్సేనాయె.[62] గింద్ల కొత్తేముంది' అన్నడు. ఎంతిలవర్సయినా గిది నాకు మంచి గనిప్పియ్యకపోవు. అల్లు గూడ మన్సుషలేనాయె. అల్లుగూడందరితో బతుకమ్మెందుకాడుకోవద్దుకనెటోన్ని. కొన్నేండ్లయినంక నేను మనుసులనుకున్నదే నిజమైంది. నేను కన్నాగురంల బియస్సి యదివేటప్పుడు 1972ల ననుకుంట ఊళ్ళోన్న పడుసు పొరగాండ్లల్ల ఒక్క ఊపొలచ్చింది. సోరోల్లందరు గల్సి యువజెన సంగం బెట్టింద్రు. హరిజెనులంత ఊళ్ళోళ్ళ తీరుగనే బతుమ్మాడాలన్నరు. పెద్ద మనుషులుగిది అద్దన్నరు. ఇలవర్సెకాదంటె ఊరికి మంచిది గాదన్నరు. ఎనుకటిదయిన, గిప్పటిదయిన మంచిలవర్సయితె పాటించాలెగని నష్టం సేసేదయితె తీసిపారెయ్యాలని పడుసోల్లన్నరు. సోరోల్లంత ఒక్క మాటమీదున్నరు. గా యేడు హరిజనులంత ఊళ్ళందరి తీరుగనే బతుకమ్మాడింద్రు. సద్దుల బతుకమ్మనాడు పెద్దపెద్ద బతుకమ్మలెత్తుకోని, కొత్తకొత్త బట్టలు కట్టుకోని సంబురపడుకుంట సెరువు కట్టకచ్చింద్రు. ఆడోల్లు బతుకమ్మ పాటలు పాడుతంటె మొగోల్లు కోలలేసుకుంట పాటలు పాడుకుంటె గురుడు వెట్టింద్రు.

కొంతమంది పెద్ద మనుషులు ఊళ్ళంత గురి మరియాద లేకుంటయిపెయిందని ముక్కులమీదేల్లేసుకున్నరు. కని పడుసోల్లంతొక్క మాటమీనుండేవారకు నోరు మూసుకోనున్నరు. సిన్నంతురం-పెద్దంతురం లేకుంటయిందని అల్లండ్లాల్నే గులుక్కోని సప్పుడు జేకున్నరు. నాకైతానాడు ఏనుగెక్కినంత సంబురమైంది. ఆనాడు నానిద్దురల మంచి మంచి కలలచ్చినయి. ఇగప్పట్నుంచందరు బతుకమ్మాడుతుంద్రు.

నా కిలాసులున్న సాంబయ్యనే మాలయినె నందరు అరె అనో, సాంబడనో పిలిసెటోల్లు. సదువుల గూడ సాంబయ్య ఉషారే. సారుతోని గలిసందరు గట్లెందుకు పిలుత్తరో నాకు సముజగాకపోవు. నాకు సదువుసెప్పినసారే బూమయ్యనుండె. అయినెది మా ఊరే. గయినె మా ఇంటికత్తె మంచాల గూసుండకపోవు. నేనెంత బలవంతం సేసినా వాకిట్లున్న బండలమీన్నే కూసుండెటోడు. ఇగనేం గూడ అయినెతోనే బండలమీదనే కూసోని మాట్లాడెటోన్ని. మా సార్ను నేను మంచాల కూకుండవెట్టకపోతినని బాదనిపిచ్చేంది.

గీ ముట్టుడు, గిన్ని బేదాలు, , పలపచ్చాలు కొందరు మనుషుల్ని హీనంగ సూసుడు గివ్వన్ని నాకు సిన్నప్పట్నుంచే సాన బాద కల్గించేటియి. గివ్వి పోతె మంచిగుండని అనుకునెటోన్ని. గిప్పుడు నాసిన్నప్పటంత గీ ముట్టుడేం లేదు. మాలమాదిగోల్లు గుల్లల్లకు గూడ పోతంద్రు. అరిజెనుల పిల్లగండ్లు సూ ఊల్లెనయితె అందరితోని బుజాలమీద సేతులేసుకోని తిరుగుతంద్రు. సానమందే సదువుకుంటంద్రు. ఇండ్లల్లకు గూడ సొచ్చుకొని పోతంద్రు సదువుకున్న పిల్లలు. ఎనుకటోల్లు, పెద్దోల్లు మాత్తురమింకా దూరదూరమే ఉంటంద్రు.

మా ఊల్లె ఇంకా ఊల్లల్ల కొంతవరకైన మార్పులు తెచ్చినోల్లకు సేతులెత్తి మొక్కాలెననిపిత్తది. మా ఊళ్ళె సదువుకున్న హరిజెన పిల్లగాండ్లంత ఒక్క మాటమీదున్నరు. గాల్లే ఊల్లె సాగిచ్చుకుంటండ్రు. ఇన్రోజులు బాదలనుబగించినం గిప్పుడు కొంత నడిపిత్తమేంది సారు అనంటరు నేను కల్సినప్పుడు. "బాజాప్త నడిపించుకోండ్రి. గిండ్లేం అనుమానం లేదు" అంట నేను.

ఓ దిక్కు గిట్ల నడుత్తనే ఉన్నదా? కని రోజుకెన్నో సంగతులు అక్సర్లల్ల సూత్తన్నం, వింటున్నం. ససంత్రమచ్చి గిన్నేండ్లయినా, ఎన్నో సేత్తున్నమని లీడర్లు సెప్పుతన్నా ఇంకా సాన ఊల్లల్ల అంటరానితనం మిగిలుంది. అల్లమీద జరిగేటన్యాయాలు సూత్తంటె నాకు సిగ్గనిపిత్తది. సానమంది ఇంకా బీదోల్లే ఉన్నరు. ఇంక గూడ గడుకమాల్లే తినటోల్లున్నరు. గివ్వన్ని పోతె మంచిగుండునని అనుకుంట.

బాగ ఆలోసించి సూత్తె మారినట్టే అనిపిచ్చినా ఎక్కడ మారిందో తెలుత్తలేదు. జగజీవరాంను కూడ గప్పట్ల గుల్లెకు రానియ్యలేదట. వాళ్లను చమార్లంటండ్రు ఒక్కకాడ. మాదిగోల్లంటర్డు ఇంకోకాడ. సమాన మనుకుంటనే ఊరవుతల ఇండ్లు గట్టిచ్చిండ్రు. మల్ల బాగ మారిందని అంటనే ఉన్నరు.

మనకు తెలువకుంటనే అల్లనట్లనే ఉంచుటానికి కొన్నిశెక్తులు పంజేత్తన్నయనిపిత్తంది. గా. శెక్తుల గురించి జాగ్రత్తగుండాలె.

అల్లను సర్కారు మనుషులనుడు, సరుకారు అల్లుండ్లనుడు నాకైతె మంచిగనిపియ్యది. మరి గీ కులాలే లేకుంట జేత్తె అన్ని మంచిగుంటయి. గదానికెవ్వలు ముందుకు రారు మరి.

అయితె ఏవో శెక్తులు గివ్వన్ని పోవుటానికి పనిజేత్తున్నయనిపిస్తుంది సూత్తంటె.

☆ ☆ ☆